క్లుప్తంగా

మెరిట్ విద్యార్థులకు రివార్డులు



మాట్లాడుతున్న రిటైర్డ్ తహసీల్దార్ శ్రీహరి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలలో 2022–23 సంవత్సరంలో పదో తరగతిలో ఎక్కువ గ్రేడ్ పాయింట్స్ సాధించిన నలుగురు విద్యార్థులకు, శనివారం రిటైర్డ్ తహసీల్దార్ శ్రీహరి నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూతన తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా, విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంలో బహుమతిని అందజేసినట్లు వివరించారు. ఒక్కొక్కరికి రూ.4వేల చొప్పున రూ.12 వేలు అందజేశారు.

పెంచిన వేతనాలు ఇవ్వాలి

ఇల్లెందురూరల్: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వర్కర్లకు పెంచిన వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో భోజన వర్కర్లు శనివారం ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ అధికారులకు అందజేశారు. సీఐటీయూ నేతలు అబ్దుల్ నబీ, సుల్తానా మాట్లాడుతూ.. 2022 మార్చి 15న అసెంబ్లీ సాక్షిగా మధ్యాహ్న భోజన వర్కర్లకు రూ.2వేలు గౌరవ వేతనంగా చెల్లిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారని గుర్తు చేశారు. కానీ నేటికీ అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ నంబర్ 8 ప్రకారం వేతనాలను ఎరియర్స్‌తో సహా చెల్లించాలని, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కొత్త మెనూను సవరించి కోడిగుడ్లకు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

టేకులపల్లి: సహకార బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి, టేకులపల్లి సహకార బ్యాంకు మేనేజర్ పి.వెంకటకృష్ణారావు కోరారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో టేకులపల్లిలోని సహకార బ్యాంకు ఎదుట ఉద్యోగులు ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. సహకార వ్యవస్థలో సమూల మార్పులు తీసుకరావాలని, రైతులకు చేరువగా సహకార రంగంలో రెండంచల విధానాన్ని అమలు చేయాలని కోరారు. డీసీసీబీలను టీఎస్ క్యాబ్‌లో విలీనం చేసి సహకార బ్యాంకుల్లో పని చేస్తున్న ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సహకార బ్యాంకులకు మూలధనాన్ని సమకూర్చాలని కోరారు.

దారి మళ్లిన నిధులు



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఇల్లెందు: వెల్ఫేర్ బోర్డు క్లెయిమ్‌లను తక్షణం పరిష్కరించాలని కోరుతూ ఇల్లెందు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. వెల్ఫేర్ బోర్డు నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపించారు. ఈ కారణంగా వెల్ఫేర్ బోర్డు కార్డు ఉన్న కార్మికులకు మరిణించినా, గాయపడ్డా, ఆడపిల్లల పెళ్లిళ్లు చేసినా రావాల్సిన పరిహారం సకాలంలో అందడం లేదన్నారు. సుదీర్ఘకాలం పాటు పెండింగ్‌లో ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణం స్పందించి బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగరాజు, మహబూబ్, లక్ష్మణ్, రాము, షాహీద్, కోటేశ్వరరావు, సత్యనారాయణ, రమేష్, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

‘ప్రైవేటు’కే విద్యార్థుల మొగ్గు

- సర్కార్ స్కూళ్లల్లో తగ్గుతున్న పిల్లలు
- 12పాఠశాలల్లో 20 మందిలోపు విద్యార్థులు
- వీరభద్రాపురం పాఠశాల మూసివేత



మూతబడిన వీరభద్రాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

జూలూరుపాడు: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఏడాదికి ఏడాది తగ్గుతోంది. ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నప్పటికీ సత్ఫలితాలు రావడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన, విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, రెండు జతల యూనిఫాం పంపిణీ చేస్తున్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా అమలు పరుస్తున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని చేపట్టినప్పటికీ విద్యార్థుల సంఖ్య పెరగడం లేదు. ప్రభుత్వ పాఠశాలలపై పిల్లల తల్లిదండ్రులకు నమ్మకం కలిగించడంలో ప్రభుత్వం విఫలం అవుతోంది. ఇందుకు కారణం ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించకపోవడం, మెరుగైన విద్యాబోధన ఉండదని, ఉపాధ్యాయుల పనితీరు సక్రమంగా ఉండదని, క్రమశిక్షణ ఉండదని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఫీజుల భారం అయినప్పటికీ ప్రైవేట్ విద్యాసంస్థల వైపే మొగ్గు చూపుతున్నారు. అదేవిధంగా ప్రభుత్వం గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు – మన బడి కార్యక్రమం ద్వారా చేపట్టిన పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. మన ఊరు–మన బడి కార్యక్రమం కింద మొదటి విడతలో జూలూరుపాడు మండలంలో 17 ప్రభుత్వ పాఠశాలలు ఎంపికైనప్పటికీ పనులు ఇంకా పూర్తి కాలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి, విద్యుత్ సౌకర్యం లేకపోవడం, శిథిలావస్థ భవనాలు, టాయిలెట్స్‌కు నీటి వసతి కల్పించకపోవడం, పాఠశాల చుట్టూ ప్రహరీ, ఆట స్థలం, ఆహ్లాదకర వాతావరణం లేకపోవడంతోపాటు, ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలపై ఆసక్తి చూపడం లేదు. పదేళ్ల క్రితం రామకృష్ణాపురం, కొత్తూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను మూసివేయగా, ఈ ఏడాది వీరభద్రాపురం పాఠశాలను మూసివేశారు. ఇక్కడ పని చేసే టీచర్, ముగ్గురు విద్యార్థులను జూలూరుపాడుకు పంపించారు. మినీ అంగన్‌వాడీ టీచర్‌కు మరో ఉద్యోగం రావడంతో ఆమె వెళ్లిపోయింది. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం కూడా లేకపోవడంతోపాటు, పిల్లలు తక్కువగా ఉన్నారనే సాకుతో పాఠశాలను కూడా మూసివేయడం సరైంది కాదని స్థానికులు వాపోతున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలను కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గంగారంతండా గిరిజన ప్రాథమిక పాఠశాలలో గత ఏడాది కూడా ఎన్‌రోల్‌మెంటులో పాఠశాలలో పిల్లలు లేరని చూపించగా.. ఈ విద్యా సంవత్సరంలో ప్రారంభం నుంచి పిల్లలు లేనట్లుగానే ఉంది. ఈ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు సమయానికి రాకపోవడం, వచ్చినా పిల్లలకు పాఠాలు చెప్పకుండా ఫోన్‌లో కాలక్షేపం, పిల్లల కోసం ఇంటింటికి తిరిగి తీసుకరావడం వంటివి చేయకపోవడంతో పాఠశాల ఆవరణం అపరిశుభ్రంగా తయారైంది. ఈ పరిస్థితుల్లో తమ పిల్లలను ఇక్కడ చదివించలేక తల్లిదండ్రులు వేరే పాఠశాలలకు పంపిస్తున్నారు. ఇల్లెందు ఏటీడీఓ రూపాదేవి పాఠశాలను సందర్శించగా.. తాళం వేసి ఉండటంతో అసలు విషయం బయటపడింది. మండలంలోని పది పాఠశాలల్లో 20 లోపు విద్యార్థులు ఉన్నారు. రామచంద్రాపురం ప్రాథమిక పాఠశాలలో 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడే ఉన్నారు. మండలంలో 37 ప్రాథమిక, ఆరు గిరిజన ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 5 జిల్లా పరిషత్ ఉన్నత, కేజీబీవీ, ఏజీహెచ్‌ఎస్‌లతో మొత్తం 55 పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలలో గత విద్యా సంవత్సరం ముగిసే నాటికి సుమారు 3,400 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది 3,000 మంది ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

చదువు సరిగా చెప్పడం లేదు



ప్రభుత్వ పాఠశాలలో చదువు చెప్పకపోవడం వల్లే మా అబ్బాయిని ప్రైవేట్ స్కూల్‌కు పంపుతున్నాం. ఎనిమిదేళ్లకు ప్రభుత్వ పాఠశాలలో 2వ తరగతి పూర్తి కాగా.. ప్రైవేట్ బడికి తీసుకెళ్తే 1వ తరగతిలో కూర్చోబెట్టారు.

– తాటి కృష్ణవేణి, పేరెంట్, వీరభద్రాపురం

పాఠశాలను కొనసాగించాలి



వీరభద్రాపురంలోని ప్రభుత్వ పాఠశాలను కొనసాగించాలి. పిల్లలు లేరని బడిని మూసివేయడం తగదు. అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా మూసివేశారు. మా ఇద్దరు పిల్లల చదువు..? జూలూరుపాడు పంపించాలంటే మూడు కిలోమీటర్లు ఉంది.

– పూనెం మౌనిక, పేరెంట్, వీరభద్రాపురం

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నాం. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. వీరభద్రాపురం స్కూల్‌లో ముగ్గురు పిల్లలు మాత్రమే ఉండటంతో ఆ పాఠశాలను జూలూరుపాడుకు తరలించాం.

– గుగులోత్ వెంకట్, ఎంఈఓ, జూలూరుపాడు

సహకార వ్యవస్థతో స్థిరమైన అభివృద్ధి



పాల్వంచ: సహకార జెండా ఆవిష్కరిస్తున్న కొత్వాల శ్రీనివాసరావు



టేకులపల్లి: బేతంపూడి సొసైటీ కార్యాలయంలో..

పాల్వంచ: సహకార వ్యవస్థతో స్థిరమైన అభివృద్ధి సాధించగలమని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా పాల్వంచ సహకార సంఘ కార్యాలయంలో సహకార పతాకాన్ని ఎగురవేశారు. మాట్లాడుతూ.. ప్రజల మధ్య సంబంధాలు, స్థానిక వనరులు పెంపొందించడం, స్థానిక సమానత, సామాజిక భాగస్వామ్యం కీలక అంశాలు సహకార వ్యవస్థలో అంతర్లీనంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేశ్, కనగాల నారాయణరావు, సామా జనార్ధన్‌రెడ్డి, చొగాని పాపారావు, ఎర్రంశెట్టి మధుసూధన్‌రావు, జరబన సీతారాంబాబు, సీఈఓ జి.లక్ష్మీనారాయణ, సురేందర్‌రెడ్డి, లక్ష్మి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా శనివారం టేకులపల్లిలోని బేతంపూడి సొసైటీ కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు లక్కినేని సురేందర్‌రావు జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో సీఈఓ పాస్నోజు ప్రేమాచారి, కందుల వెంకటేశ్వర్లు, సంఘ డైరెక్టర్లు గుడిపుడి కృష్ణార్జునరావు, ఉల్లోజి ఉదయ్‌చందర్, దోర్నాల విజయ్ మోహన్‌రావు, చీమల లక్ష్మీనారాయణ రైతులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన పర్సనల్ జీఎం



హనుమంతరావును సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కార్పొరేట్ జనరల్ మేనేజర్ (ఐఆర్‌పీఎం)గా బి.హనుమంతరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) విధులు నిర్వహించిన ఏ.కుమార్‌రెడ్డి జూన్ 30న ఉద్యోగ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో సింగరేణి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న హనుమంతారావును యాజమాన్యం బదిలీ చేసింది. ఈ సందర్భంగా టీబీజీకేఎస్, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ నాయకులు హనుమంతరావుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. నాయకులు మాట్లాడుతూ.. హనుమంతరావు 1990 సింగరేణిలో వెల్ఫేర్ ఆఫీసర్‌గా సింగరేణి సంస్థలో చేరి అంచెలంచెలుగా ఎదిగి జీఎం పర్సనల్‌గా ఎంపిక కావడం అభినందనీయమని, తెలంగాణ బిడ్డగా ఈ అవకాశం రావటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ జనరల్ సెక్రటరీ మిరియాల రాజిరెడ్డి, కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, కూసన వీరభద్రయ్య, కాపు కృష్ణ, సుధాకర్‌రెడ్డి ప్రభాకర్‌రావు, నిమ్మల రాజేశ్వరరావు, ప్రభాకర్‌రావు, బి.రాజేశ్వరరావు, జెల్లి కిరణ, ,చిలక రాజయ్య పాల్గొన్నారు.

ఇంటింటికీ బీజేపీ

సుజాతనగర్: మండలంలోని సర్వారం గ్రామంలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 235, 236, 237 పోలింగ్ బూత్‌ల్లో మేరా బూత్ సబ్ సే మజ్‌బూత్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గుగులోతు రమేష్ బాబు, భూక్యా రాజేష్ నాయక్, టి.నరేంద్రబాబు, నాగలింగం, రామచంద్రరావు పాల్గొన్నారు.

తరలివచ్చిన గోదావరి జలాలు



ట్రయల్ రన్‌ను పరిశీలిస్తున్న కౌన్సిలర్ లక్ష్మి

ఇల్లెందు: గోదావరి జలాలు పట్టణంలోని స్టేషన్ బస్తీకి శనివారం చేరుకున్నాయి. బస్తీలో ప్రతిఇంటికీ పంపు కనెక్షన్ ఇవ్వడంలో భాగంగా మూడు నెలలుగా పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. 20వ వార్డు పరిధిలోని ఒక బ్లాక్‌లో శనివారం ట్రయల్ రన్ ప్రారంభించారు. ఎటువంటి అవాంతరాలు లేకుండా తాగునీటి సరఫరా కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ మొగిలి లక్ష్మి మాట్లాడుతూ.. ట్రయల్ రన్‌ను పరిశీలించి గోదావరి జలాల తాగునీటి సరఫరాను పూర్తిస్థాయిలో ప్రారంభిస్తామని చెప్పారు. సూర్యనారాయణ, హరిప్రసాద్, హబీబ్, శంకర్, అఫ్జల్, విజయ్, మణికంఠ, సంతోష్ పాల్గొన్నారు.

బీఆర్‌టీయూ జనరల్ సెక్రటరీగా రమేష్



నియామకపత్రం అందుకుంటున్న రమేష్

పాల్వంచ: కేటీపీఎస్ 7వ దశలో గ్రేడ్ 1 ఫోర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ టీఆర్‌వీకేఎస్ యూనియన్‌లో రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న చారుగుండ్ల రమేష్ భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ జిల్లా జనరల్ సెక్రటరీగా నియామకమయ్యారు. శనివారం స్థానిక కేటీపీఎస్ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు జి.రాంబాబు యాదవ్ నుంచి నియామకపత్రాన్ని అందుకున్నారు. రమేష్ మాట్లాడుతూ.. కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానన్నారు.

ప్రజాప్రతినిధులు పదవులకు వన్నె తేవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా

సుజాతనగర్: ప్రజాప్రతినిధులు తమ పదవులకు వన్నె తెచ్చేలా పనిచేయాలని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రం సుజాతనగర్‌లో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ మండల నూతన కమిటీతో పాటు, అనుబంధ సంఘాల్లో పదవులు పొందిన ప్రజాప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు. మాట్లాడుతూ... రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న సీఎం కేసీఆరే ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి అవుతాడని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుబంధు, దళితబంధు, కల్యాణలక్ష్మి, రైతుబీమా వంటి అనేక సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ దేశానికే తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. దేశం కోసం జాతీయ పార్టీని ప్రారంభించి ముందుకెళ్తున్న సీఎం కేసీఆర్‌కు అన్నివర్గాల ప్రజలు మద్దతివ్వాలని కోరారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా మళ్లీ అధికారమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల ఎంపీపీలు బాదావత్ శాంతి, సోనా, సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు, ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, అన్నపురెడ్డి శ్యాంరెడ్డి, లావుడ్యా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ ఎన్నిక



తులసిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా వేపలగడ్డ గ్రామానికి చెందిన రెడ్డెం తులసిరెడ్డి ఎన్నికయ్యారు. పార్టీ మండల నూతన కమిటీతో పాటు, అనుబంధ సంఘాల కమిటీలను ఎమ్మెల్యే సమక్షంలో శనివారం ప్రకటించారు. రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్‌గా పెద్దమళ్ల నరేందర్, గ్రామ కన్వీనర్‌గా వేములపల్లి సత్యనారాయణ, ఎస్సీ సెల్ మండల సహాయ కార్యదర్శిగా కత్తి బాలకృష్ణ, ఎస్సీ సెల్ సుజాతనగర్ గ్రామ అధ్యక్షుడిగా కత్తి కృష్ణ, బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా జంగిలి వెంకన్న, బీసీ సెల్ యూత్ సెక్రటరీగా కస్నబోయిన నరసింహారావును ఎన్నుకున్నారు.

వీధి కుళాయిలను పునరుద్ధరించండి



నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డులల్లో సింగరేణి ఆధ్వర్యంలో వీధి కుళాయిలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ఆధ్వర్యంలో సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. కామేష్ మాట్లాడుతూ.. కొత్తగూడెంలో కిన్నెరసాని నీటి సరఫరాకు ముందు పట్టణమంతా వీధి కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా జరిగేదన్నారు. మార్చి నుంచి ఇప్పటి వరకు నెలలో 10 రోజులు కూడా నీటి సరఫరా లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు.

కిన్నెరసాని పైపులైన్లకు మరమ్మతుల పేరుతో రూ.కోట్లు ఖర్చు అవుతున్నా ఫలితం శూన్యం అన్నారు. సింగరేణి యాజమాన్యం సీఎస్సార్ పాలసీలో భాగంగా కొత్తగూడెం పట్టణానికి వీధి కుళాయిలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంధం మల్లికార్జున్‌రావు, మాలోత్ వీరు, చెనిగరపు నిరంజన్, అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్, జర్పుల కల్యాణ్, మాలోత్ పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

జనగర్జన సభకు తరలిరండి..



టేకులపల్లిలో మాట్లాడుతున్న సురేందర్‌రావు

టేకులపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారమే లక్ష్యంగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పేరుతో 106 రోజులుగా 50 నియోజకవర్గాల్లో నిర్వహించిన పాదయాత్ర ముగింపు, ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిక సందర్భంగా ఆదివారం ఖమ్మంలో ఏర్పాటు చేసిన జనగర్జన బహిరంగ సభకు మండలం నుంచి భారీగా తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నేత లక్కినేని సురేందర్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం టేకులపల్లిలోని పొంగులేటి, కోరం కనకయ్యల క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పూనెం సురేందర్, బోడ మంగీలాల్, బాణోతు శంకర్, ఉండేటి ప్రసాద్, భిక్కులాల్, మధురెడ్డి, గణేష్,దేవ్‌సింగ్, రవి, పోశాలు, శివ, సంజయ్, పూన్యా, తారాసింగ్,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుజాతనగర్: ఖమ్మం నగరంలో ఆదివారం నిర్వహించనున్న జన గర్జనసభ విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో పార్టీ శ్రేణులు శనివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గరీబ్‌పేట, సర్వారం, నిమ్మలగూడెం, కోమటపల్లి తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సభకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లింగం పిచ్చిరెడ్డి, కస్నబోయిన భద్రం, బాగం మోహన్‌రావు, బానోత్ రామనాథం, చిమట నాగేశ్వరరావు, ఉపేందర్, బానోత్ సక్రాం, రమేష్, కర్నాటి చందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహిస్తున్న తెలంగాణ జనగర్జన సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు పులి సైదులు పిలుపునిచ్చారు. మండలంలోని 21పిట్ ఏరియాలో శనివారం ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీపుల్స్ మార్చ్ పేరుతో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు చేపట్టిన సుదీర్ఘ పాదయాత్ర ముగింపు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరిక పురస్కరించుకొని కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ జరుగుతోందని చెప్పారు. సమావేశంలో తిలక్‌నగర్ సర్పంచ్ ధనసరి స్రవంతి, తాడెం సామ్రాజ్, ఎట్టి హరికృష్ణ, పూనెం శ్రీరాములు, గడదాసు వెంకటేశ్వర్లు, రుద్ర రామస్వామి, కాయం రమేష్, గడ్డి శ్రీను, గూడ బాబూరావు, పోషయ్య, అరకల రాజయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

గని ఉద్యోగులకు భద్రతపై అవగాహన



కేఓసీలో పని ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

టేకులపల్లి: కోయగూడెం ఉపరితల గని ఉద్యోగులకు హాల్ రోడ్స్, తేలికపాటి వాహనాల భద్రతపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జేకే ప్రాజెక్ట్ ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. మాట్లాడుతూ.. పని ప్రదేశాలలో ఉద్యోగులందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ప్రమాదాలకు తావు లేకుండా వారికి ఎస్ఓపీలు, సీఓసీలు పాటించాలన్నారు. ఉద్యోగులకు వారి పనిపై వారికి పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని చెప్పారు. హైవాల్ దగ్గరలో పనిచేసేటప్పుడు అన్ని జాగ్రత్తలు పాటించాలని, ఉపరితల గనులలో వర్షాకాలంలో లైట్ మోటార్ వెహికల్ డ్రైవర్లకు, డంపర్ ఆపరేటర్లు తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. అదేవిధంగా హాల్ రోడ్లపై వాహనాలు నడిపేటప్పుడు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని, సంస్థ నిర్దేశించిన ఉత్పత్తిని రక్షణతో సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో కేఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రహ్లాద్, గని మేనేజర్ సౌరబ్ సుమన్, సేఫ్టీ ఆఫీసర్లు రాజు, శివ ప్రసాద్, జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జ్ రవికుమార్, పిట్ కార్యదర్శి అశోక్ కుమార్ ఇతర అధికారులు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పైపులైన్‌కు మరమ్మతులు చేయండి..



టేకులపల్లి మండలం బేతంపూడి పంచాయతీకి మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం దర్గా వద్ద ఉన్న ట్యాంకు నుంచి కనెక్షన్ ఇచ్చారు. సుమారు 8 నెలల క్రితం రోడ్డు నిర్మాణం చేపట్టినప్పుడు బొడ్రాయి వద్ద మిషన్ భగీరథ పైపు పగిలిపోయింది. ట్యాంకు నుంచి వచ్చే పైపుని రోడ్డు పైకి ఉంచి దానికి మూత పెట్టి వదిలేశారు. గ్రామస్తులు నెలల తరబడి పలుమార్లు పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా పైపుకి మరమ్మతులను నోచుకోకపోవడం గమనార్హం. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేసి గ్రామంలో నీటి సరఫరా పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. – టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : మీనా, కార్యదర్శి, బేతంపూడి
సెల్ నెంబర్: 8179475840

ఘనంగా వైద్యుల దినోత్సవం





కొత్తగూడెంఅర్బన్: కేక్ కట్ చేస్తున్న డీఎంహెచ్ఓ శిరీష, సుజాతనగర్: వైద్య సిబ్బందికి సన్మానం

కొత్తగూడెంఅర్బన్: వైద్యరంగానికి ఆద్యుడైన డాక్టర్ బీసీ రాయ్ అడుగుజాడల్లో నడవాలని డాక్టర్ బి.కృష్ణయ్య అన్నారు. శనివారం జాతీయ డాక్టర్స్ దినోత్సవం పురస్కరించుకొని, ప్రకృతి ఆశ్రమం ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని ప్రముఖ వైద్యులకు మొక్కలు అందించి సన్మానించారు. కృష్ణయ్య మాట్లాడుతూ.. డాక్టర్లు బీసీ రాయ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సీనియర్ సర్జన్, జాతీయ బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్లు వాసిరెడ్డి రమేష్ బాబు, శ్యామలాంబ, నరేందర్ దంపతులను, మెడికేర్ అధినేత ఉపేందర్‌రావు, నాగరాజు, విజేందర్‌రావు, కనకరాజు, ఇరుకు బాబురావులను సన్మానించారు.

వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో..

ఇంటర్నేషనల్ డాక్టర్స్ డే సందర్భంగా శనివారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జేవీఎల్ శిరీష కేక్ కట్ చేశారు. మాట్లాడుతూ.. డాక్టర్లందరికీ డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ కొత్తగూడెం డాక్టర్ సుకృత, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుందర్, డాక్టర్ చైతన్య, డాక్టర్లు స్పందన, డిప్యూటీ డెమో ఎండీ ఫయాజ్ మొయిద్దిన్, నాగలక్ష్మి, డీపీహెచ్ ఎన్.అన్నమేరి, ఏఓ మోహన్, సూపరింటెండెంట్ సుదర్శన్, సింగోజి, హెల్త్ ఎడ్యుకేటర్లు విజయ్ కుమార్, బేబీ, సూపర్‌వైజర్లు నాగభూషణం పాల్గొన్నారు.

సుజాతనగర్: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వైద్యులు బి.రమేష్, బి.పూజా, ఏఎన్ఎం జానకీ తదితరులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ.. కరోనా కష్టకాలంలో వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు విశేష సేవలందించారని తెలిపారు. కార్యక్రమంలో మిరియాల శ్రీలత, భాగ్యలక్ష్మి, అన్నవరపు పూర్ణచందర్‌రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.